కొరవడిన పర్యవేక్షణ

- విజయవాడ నుంచి వస్తున్న అధికారులు
- సమావేశాలకే పరిమితమవుతున్న వైనం
- ప్రజాసమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం
- తూతూమంత్రంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు



కృష్ణాజిల్లా కలెక్టరేట్ ముఖద్వారం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పాలనపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశంతో ఉమ్మడి కృష్ణా జిల్లాను రెండు జిల్లాలుగా విభజించారు. ఆ దిశగా నేటి ప్రభుత్వంలో అడుగులు పడటం లేదు. జిల్లా అధికారులు ఎక్కువ సమయం సమీక్షలు, సమావేశాలకే పరిమితమవుతున్నారని, ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక పని కోసం పదుల సార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు వాపోతున్నారు.

స్థానికంగా నివాసం ఉండటం లేదు

ఎన్‌టీఆర్ జిల్లాగా విభజన అనంతరం కృష్ణాజిల్లా పాలన మచిలీపట్నం కేంద్రంగా సాగుతోంది. ఆయా శాఖల జిల్లా అధికారులు మచిలీపట్నంలోనే నివాసం ఉండాలని గత ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా ఉన్నతాధికారులు మచిలీపట్నంలోనే నివాసం ఉంటున్నప్పటికీ కొంతమంది జిల్లా స్థాయి అధికారులు ఇంకా విజయవాడలోనే నివాసం ఉంటున్నారు. ఏదైనా సమావేశాలు, సమీక్షలు ఉంటే తప్ప మచిలీపట్నంకు రావటం లేదు. క్యాంపుల పేరుతో సాకులు చెప్పి విజయవాడకే పరిమితమవుతున్నారు. ఆయా కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఆ పని ఎప్పుడవుతుందోనని అధికారులు నిరాశ చెందుతున్నారు. జిల్లా అధికారులందరూ కచ్చితంగా మచిలీపట్నంలోనే నివాసం ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణమే వారి పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం జరగడం లేదు

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో పాటుగా కలెక్టర్ డీకే బాలాజీ నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మీ కోసం కార్యక్రమంలో ప్రతి సోమవారం 100 నుంచి 150 వరకు అర్జీలు వస్తున్నాయి. ఈ అర్జీల పట్ల అప్పటికప్పుడే ఉన్నతాధికారులు సంబంధిత జిల్లా అధికారులను పిలిచి పరిష్కరించాలని ఆదేశాలు ఇస్తున్నప్పటికీ ఆ దిశగా పనులు జరగటం లేదని అర్జీదారుల వాదన. మీకోసం కార్యక్రమానికి మళ్లీ మళ్లీ రావాల్సి వస్తోందని, శాశ్వత పరిష్కారం చూపటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ హెచ్చరించినా పట్టించుకోని అధికారులు

పలు శాఖలకు సంబంధించి సమీక్షలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు ఆయా శాఖలకు సంబంధించి పనులు, లక్ష్యాలు నిర్దేశించేలా సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నారు. కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని ఒకరిద్దరు అధికారులు తప్ప మిగిలిన వారెవరూ ఆ దిశగా విధులు నిర్వహించటం లేదని తెలుస్తోంది. ఈ విషయంపై ఇటీవల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టర్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. శాఖాపరంగా లక్ష్యాలు సాధించేలా నివేదికలు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఆయా శాఖల జిల్లా అధికారులు సమావేశాలకు వచ్చేటప్పుడు అరకొర సమాచారంతో హాజరవుతున్నారని ప్రభుత్వ లక్ష్యాలు, ఆదేశాలు నెరవేర్చకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్ డీకే బాలాజీ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన జిల్లాల విభజన అధికారుల నిర్లక్ష్య వైఖరితో నీరుగారిపోతోందని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లాలో టెట్ పరీక్ష ప్రశాంతం

పెడన: జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో టెట్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మొదటి సెషన్‌లో 370 మందికి గాను 320 మంది హాజరవగా, రెండో సెషన్‌లో గాను 316 మంది హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈవో కార్యాలయం ఏడీ మనోహర్ నాయక్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పెడన నందమూరు పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటిండెంట్‌గా డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.

శ్రీజలధీశ్వర స్వామి వారి ఆదాయం రూ.93,552

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బాల పార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి వారి దేవస్థానంలోని హుండీ కానుకలను మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. మొత్తం ఆరు నెలలకు గాను రూ.93,552 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో గొర్రెపాటి వెంకట రామకృష్ణ (ట్రస్టీ), అర్చకులు, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోగినేనిపాలెంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం



గోగినేనిపాలెం(ఘంటసాల): ఎన్నో ఏళ్ల తర్వాత తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామానికి శనివారం నూతనంగా బస్సు సౌకర్యం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సు అవనిగడ్డలో బయలుదేరి చల్లపల్లి నుంచి చిట్టూర్పు, వేములపల్లి, చినకళ్లేపల్లి, గోగినేనిపాలెం మీదగా పాపవినాశనం, శ్రీకాకుళం చేరుకుంటుంది. ఉదయం సాయంత్రం రెండు పూటలా బస్సు సర్వీసు తిరుగుతుంది.

మత్స్యకార కుటుంబాలకు ఉపాధ్యాయుల చేయూత

నాగాయలంక: కృష్ణానది తీరంలోని నాగాయలంక చిన కరకట్ట కింద నివాసిత ప్రాంతంలో వరద ప్రభావిత మత్స్యకార కుటుంబాలకు మండలంలోని ఉపాధ్యాయులు సమకూర్చిన సహాయాన్ని శనివారం స్థానిక శ్రీరామ పాద క్షేత్రం పుష్కర ఘాట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 80 మత్స్యకార కుటుంబాలకు ఉపాధ్యాయవర్గాలు ఒక్కోటి రూ.80వేలతో సమకూర్చిన సంపూర్ణ వంట సామగ్రి కిట్స్‌ను బాధితులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు వెంకట్రామ్(రాజా)చేతుల మీదుగా అందజేశారు.

నట్టల నివారణతో రైతులకు ప్రయోజనం



గూడూరు: మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు ఇవ్వడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. మండలంలోని చిట్టిగూడూరులో శనివారం గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గూడూరు మండల పశుసంవర్ధక శాఖ అధికారి బి.విజయ్‌కుమార్, షీప్ సొసైటీ అధ్యక్షుడు కొణతం శివకోటేశ్వరరావు, లంకా సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు వితరణ



నంగేగడ్డ(నాగాయలంక): స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 116 మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కమ్మిలి వాణి, ఆమె భర్త రామారావు ఆర్థిక సౌజన్యంతో శనివారం దుప్పట్లు, దోమతెరలను బహూకరించారు. రూ.29వేల విలువైన వీటిని ఎంఈఓ టీవీఎం రామదాసు, దాతల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

కృష్ణమ్మ చెంతకు దుర్గమ్మ



మోపిదేవి: దసరా మహోత్సవాల సందర్భంగా మోపిదేవి బస్టాండ్ సమీపంలో చలువ పందిళ్ల కింద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని శనివారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తరలించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా 'సాక్షి' మ్యాథ్స్‌బీ

మచిలీపట్నంటౌన్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పరాసుపేటలో ఉన్న డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో సాక్షి మ్యాథ్స్‌బీ పరీక్ష ఉత్సాహంగా సాగింది. మొత్తం 33 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సింహాచల అప్పలనాయుడు మాట్లాడుతూ 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మ్యాథ్స్‌బీ పరీక్ష నిర్వహించటం వల్ల విద్యార్థులకు మ్యాథ్స్‌పై పట్టు లభిస్తుందన్నారు. మ్యాథ్స్‌బీ తో పాటు స్పెల్‌బీ కూడా నిర్వహిస్తున్నారని ఫలితంగా విద్యార్థుల్లో ఆయా సబ్జెక్టుల పట్ల పూర్తి అవగాహన కలుగుతోందన్నారు.



మ్యాథ్స్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: ప్రస్తుతం పల్లె పండుగ కార్యక్రమం ద్వారా కొన్ని అభివృద్ధి పనులకు మాత్రమే శ్రీకారం చుడుతున్నామని, రానున్న రోజుల్లో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పుల్లపాడు, శేరివత్తర్లపల్లి, చోడవరం గ్రామాల్లో శనివారం ఎన్ఆర్ఈజీఎస్‌తో చేపడుతున్న సీసీ రోడ్లు, ప్రహరీలు, శ్మశాన వాటిక షెడ్లకు ఆయన శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పెడన నియోజకవర్గ వ్యాప్తంగా రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులను సంక్రాంతి లోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలిన చోట్ల రోడ్లు, ఇతర సమస్యలను పరిష్కరించి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించడం జరుగుతుందని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు లేని ప్రాంతాల్లో రోడ్లు వేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో వర్షం పడి నీరు కారుతోందని, మరమ్మతులు చేయించాల్సిందిగా అంగన్‌వాడీ టీచర్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కార్యదర్శి శీరం ప్రసాద్, బొల్లా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాం, పీఆర్ ఏఈ ధర్మయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె



గిలకలదిండిలో ఉయ్యాల ఊగుతున్న యువతులు



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్పలో రోటి ఊయల ఊగుతున్న యువతులు



అవనిగడ్డ క్రాంతి కళాశాలలో ఊయల ఊగుతున్న ఎంపీపీ సుమతీదేవి, సాయి సుప్రియ

మచిలీపట్నంటౌన్/కోనేరుసెంటర్: నగరంలోని 20వ డివిజన్ గిలకలదిండిలో శనివారం అట్లతద్దె పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ముందు ఉన్న ఖాళీస్థలంలో భారీ ఉయ్యాలలు ఏర్పాటుచేసి యువతులు ఉయ్యాలలూగారు. తాళ్లపాలెం, పోలాటితిప్ప గ్రామాల్లో రోటి ఉయ్యాలల్లో మహిళలు, యువతులు ఊయల ఊగారు.

- **కోడూరు:** కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో శనివారం అట్లతద్దె వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోడూరులోని పలు ప్రయివేటు పాఠశాలల్లో అట్లతద్ది వేడుకలను నిర్వహించారు.
- **బంటుమిల్లి:** మండల పరిధిలో గ్రామ, గ్రామాన శనివారం అట్ల తద్దె పండుగ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. బంటుమిల్లి మండలం నారాయణపురం గ్రామంలో రోటి ఉయ్యాలలు వేసి మహిళలు ఊయల ఊగి సందడి చేశారు.
- **కృత్తివెన్ను:** మండల వ్యాప్తంగా మహిళలు అట్లతద్దెను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్యంగా నూతనంగా వివాహం జరిగిన నవవధువులు ప్రథమ వాయినాలను సంప్రదాయబద్ధంగా తీర్చుకున్నారు. తీర గ్రామాలైన ఒర్లగొందితిప్ప, పోడు, ఇంతేరు, చినగొల్లపాలెం, మాట్లాం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన రోటి ఉయ్యాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- **అవనిగడ్డ:** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అట్లతద్ది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, మాజీ ఎంపీపీ బీవీ కనకదుర్గ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ, అధ్యాపకులతో పాటు విద్యార్థినులు ఊయలలు ఊగి సందడి చేశారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వైన్ షాప్ మార్చాలని ధర్నా

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ, జనసేన నేతలు



చల్లపల్లి(అవనిగడ్డ): కృష్ణాజిల్లా చల్లపల్లి మూడవ వార్డులో ఏర్పాటు చేసిన వైన్ షాపుని మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సీపీఎం, సీపీఐ, జనసేన నాయకులతో పాటు స్థానికులు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. నివాస గృహాల మధ్య జనావాసాలతో రద్దీగా ఉండే బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ వైన్ షాప్ వల్ల ఎన్నో సమస్యలు ఎదురవుతాయని, దీనిని వెంటనే వేరే ప్రాంతానికి మార్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వనజాక్షికి ఈమేరకు వినతి పత్రం అందించారు. తరువాత వారంతా మొవ్వ ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మధు, సీపీఐ నాయకుడు అద్దాడ ప్రసాద్, మహ్మద్ కరీముల్లా, జీవీ తాతారావు, జనసేన నాయకులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థినులు సేవా భావం పెంపొందించుకోవాలి



మచిలీపట్నంటౌన్: విద్యార్థినులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. స్థానిక లేడీయాంప్తిల్ జూనియర్ ప్రభుత్వ బాలికల కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా నగరంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సేవలందించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారి లంకిశెట్టి హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

రహదారులన్నీ జలమయం



ఘంటసాల: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఘంటసాలలోని ప్రధాన రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఘంటసాల నుంచి మల్లంపల్లి వెళ్లే ప్రధాన రహదారి గుంతల్లో వర్షపు నీటితో నిండిపోయి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో నుంచి అంబేడ్కర్ నగర్, బోళ్లపాడు, రెండు పల్లెలు, మల్లంపల్లి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రజలు, విద్యార్థులు, వివిధ పనులపై ఆయా గ్రామాల నుంచి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలకు వెళ్లే రహదారి కూడా జలమయంగా మారడంతో ఆసుపత్రికి వెళ్లే ప్రజలు, ఆ రోడ్డులో నివసించే గృహాల వారు ఇబ్బందులు పడుతున్నట్టు చెబుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో విష పురుగులు ఎక్కడ ఇళ్లల్లోకి ప్రవేశిస్తాయోనని భయాందోళన చెందుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్ల సత్వర నిర్మాణమే నిధులకు సాఫల్యత

- పల్లె పండుగలో అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్
- 3 పంచాయతీల్లో రూ.152.7లక్షలతో 21 సీసీ రోడ్లకు శంకుస్థాపన



నాగాయలంకలో సీసీ రోడ్ల శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

నాగాయలంక: నిధులు మంజూరు మాత్రమే ప్రామాణికం కాదని పంచాయతీల సమగ్ర అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని నిబద్ధతతో పనిచేసి చేపట్టిన రోడ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేస్తేనే ప్రజలకు మేలు చేకూరుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వక్కపట్లవారి పాలెం, భావదేవరపల్లి, నాగాయలంక పంచాయతీల పరిధిలో రూ.152.7లక్షల నిధులతో చేపట్టే 21 సీసీ రోడ్ల పనులకు శనివారం ఎమ్మెల్యే భూమి పూజలు జరిపారు. నియోజకవర్గ జనసేన యువనేత మండలి వెంకట్రామ్(రాజా) మాట్లాడుతూ డీఆర్‌డీఓ ప్రాజెక్టు నాగాయలంకకే కాకుండా కృష్ణాజిల్లాకే వరం అని అన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు అంబటి శ్యామ్‌ప్రసాద్, మండలి ఉదయభాస్కర్, కైతేపల్లి అంకాలు, నాగాయలంక ఉప సర్పంచి తలశిల నాని, టీడీపీ నేతలు తలశిల స్వర్ణలత, మండవ బాలవర్ధిరావు, మెండు లక్ష్మణరావు, జనసేన నాయకులు బండ్రెడ్డి మల్లికార్జున్, బోనం పాపారావు, బండ్రెడ్డి హరి, ఎంపీడీఓ జె.ఎస్.కె రామ్‌కుమార్, పీఆర్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ఏఈఈ వి.విజయకుమార్, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ ఉల్లి, టమాటా సద్వినియోగం చేసుకోండి

మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలతో ఉద్యాన, కూరగాయ, ఉల్లి పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరపై ఉల్లి, టమాటా అందిస్తోందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత కోరారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఆమె మచిలీపట్నం రైతుబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ధరల సూచీ బోర్డులో ఉన్న ధరల ప్రకారమే కూరగాయలు అమ్ముతున్నదీ, లేనిదీ వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుంచి టమాటా, కర్నూలు జిల్లా నుంచి ఉల్లిపాయలు నేరుగా మార్కెటింగ్‌శాఖ ద్వారా కొనుగోలు చేసి తక్కువ ధరకే వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. టమాటా, ఉల్లి పాయలు కేజీకి రూ.40 కే రైతుబజారులో అందిస్తున్నామన్నారు. నూనె, కందిపప్పును బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు పౌర సరఫరాల శాఖ ద్వారా రైతుబజారులో అందిస్తున్నారన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు నాణ్యత తగ్గకుండా వినియోగదారులకు అందిస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతుబజారులో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయలను ముఖ్యంగా ఉల్లి, టమాటాలను అందుబాటులో ఉంచి బహిరంగ మార్కెట్‌లో కూడా ధరలను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.నిత్యానందం, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుబజారులో కూరగాయల ధరలను విచారిస్తున్న మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్


అవనిగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఆయన దరఖాస్తులు తీసుకుని తహసీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో జనసేన యువనేత మండలి వెంకట్రామ్(రాజా), టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, బీజేపీ నాయకులు టీవీ గిరి, జనసేన మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీలు బొప్పన భాను, కటికల వసంత్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చోటు మారిన పల్లె పండుగ శిలాఫలకం

సాక్షి ఎఫెక్ట్

నాగాయలంక: గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రోడ్లకు భూమిపూజకు నాగాయలంకలో రెండు శిలాఫలకాల నిర్మాణంతో శుక్రవారం బహిర్గతమైన టీడీపీ నేతల వర్గపోరుకు శిలాఫలకాన్ని మరో చోటుకు మార్చడంతో శనివారం గుట్టుగా తెరదించారు. టీడీపీకి చెందిన ఉపసర్పంచ్ తలశిల నాని, మరో నేత మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం రెండు శిలాఫలకాలు నిర్మాణం చేయించిన విషయం విదితమే. ఈ విషయమై వర్గపోరుకు వేదికగా 'పల్లె పండుగ' శీర్షికతో శనివారం 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పల్లెపండుగ భూమిపూజ కార్యక్రమం దక్షిణం వైపు వెలుగు ఆఫీసు పక్కకు గుట్టు చప్పుడు కాకుండా మారిపోయింది. రాత్రికి రాత్రే తూర్పు బజారులోని శిలాఫలకం తొలగించి అక్కడికి చేర్చారు. ఉదయానికి బాలవర్ధిరావు ఆధ్వర్యంలో నిర్మించిన శిలాఫలకం మాత్రమే ఉంది. పల్లెపండుగ కార్యక్రమం షెడ్యూల్ సమయానికి అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అక్కడికి చేరుకుని భూమిపూజ జరిపి శిలాఫలకం ఆవిష్కరించారు.

బందరులో భారీ వర్షం



మచిలీపట్నం టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శనివారం నగరంలో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కాచి, ఆ తరువాత వాతావరణం ఒక్కసారిగా మారి మబ్బులు కమ్మాయి. పలు దఫాలుగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీల్లోని రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రహదారులపై నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం విద్యాసంస్థలు, కార్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు రోడ్లపై నీరు చేరటంతో ఇబ్బందులకు గురయ్యారు.